GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

T MEDIA

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : బుధవారం-జనవరి 10-2024 పేజీలు : 3

## ఇండోనేషియా దీవుల్లో భారీ భూకంపం.. 6.7 తీవ్రత

**టీ మీడియా, జనవరి 9, జకార్త:**




ఇండోనేషియాలోని తలాడ్ దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున 2.18 గంటలకు తలాడ్ దీవుల్లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.7గా నమోదయింది. భూ అంతర్భాగంలో 80 కిలోమీటర్ల లోతులో ప్రకంపణలు చోటుచేసుకున్నాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. ఫిలిప్పీన్స్ తీరంలోని పసిఫిక్ మహాసముద్రంలో భూమి కంపించిందని అధికారులు తెలిపారు. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. కొత్త సంవత్సరం రోజున జపాన్‌లో 7.6 తీవ్రతతో భారీ భూకంపం వచ్చిన విషయం తెలిసింది. భూకంపం ధాటికి ఇప్పటివరకు 100 మందికిపై మరణించారు. మరో 200కుపైగా మంది ఆచూకీ లభించలేదు.

## రోడ్డుపై ప్రజాపాలన దరఖాస్తులు

- ఇద్దరు సస్పెండ్

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**



ప్రజాపాలన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై తెలంగాణ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. బాలానగర్ ఫ్లై ఓవర్‌పై పడిపోయిన అభయ హస్తం దరఖాస్తుల ట్రాన్స్‌పోర్టు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బల్దియా చర్యలకు దిగింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు అందించాలని డిప్యూటీ జోనల్ కమిషనర్‌ను కమిషనర్ రొనాల్డ్ రోస్ ఆదేశించారు. అనంతరం దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ వేటు వేశారు. ఆన్‌లైన్ ఎంట్రీ చేసే క్రమంలో అనవసరంగా బయటివారికి అప్లికేషన్లు ఇచ్చి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు టీమ్ లీడర్స్‌పై వేటు పడింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ టీమ్ లీడర్, హయత్‌నగర్ టీమ్ లీడర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో అప్లికేషన్స్ పెట్టుకుంటే, వాటిని జాగ్రతగా అప్లోడ్ చేయాలన్నారు. ప్రజలకు సంబంధించిన అప్లికేషన్స్ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా చర్యలు తప్పవని రొనాల్డ్ హెచ్చరిచారు. ఏ ఒక్క అప్లికేషన్ వదలకుండా అప్లోడ్ చేయాల్సిందే అని స్పష్టం చేశారు.

## సీఎంతో గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ

# ప్రతినిధులు భేటీ

### స్కిల్ డవల్మెంట్ పై కూడా దృష్టి పెట్టాలని సూచన



**టీ మీడియా, జనవరి 9, హైద్రాబాద్ బ్యూరో :**

గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తో మంగళవారం డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో భేటీ అయింది. గోద్రెజ్ అగ్రోవెట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బలరాం సింగ్ యాదవ్, ఇతర కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్, ఫర్నీచర్, కన్స్యూమర్ గూడ్స్ రంగాల్లో ఉన్న అపారమైన అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి కంపెనీ ప్రతినిధులకు సూచించారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ తెలంగాణలో ఇప్పటికే పలు వ్యాపారాలు నిర్వహిస్తోంది. వంట నూనెలు, డెయిరీ, ఆగ్రో, వెటర్నరీ సర్వీసెస్, ఆగ్రో కెమికల్స్, పశువుల దాణా, వెటర్నరీ సర్వీసెస్ రంగాల్లో వ్యాపారం కొనసాగిస్తోంది. మలేషియాకు చెందిన సిమ్ డార్బీ కంపెనీతో కలిసి ఖమ్మం జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్ ను ఈ కంపెనీ ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే కంపెనీ చేపట్టిన ఆయిల్ పామ్, డెయిరీ బిజినెస్ ను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించాలని కంపెనీ ప్రతినిధులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఐటి మరియు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ జయేశ్ రంజన్, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎవరికీ తలవంచం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**

తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎవరికీ తలవంచేది లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. "ఫార్ములా ఈ-రేస్ నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రానికి ఏదో నష్టం జరిగిందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం, ఫార్ములా ఈ-రేస్, ఏస్ నెక్స్ట్ జెన్ మధ్య ట్రై పార్టీ అగ్రిమెంట్ జరిగింది. ఒప్పందం ప్రకారం ప్రభుత్వం ట్రాక్ సదుపాయం కల్పించాలి. రేస్ ద్వారా టికెట్లు అమ్ముకొని లబ్ధిపొందాలని ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ భావించింది. ట్రై పార్టీ ఒప్పందాన్ని బై పార్టీ అగ్రిమెంట్‌గా మార్చేశారు. రేస్‌కు సంబంధించి రూ.110 కోట్లు చెల్లించి అనుమతులు ఇప్పించాలని నిబంధన. రూ.55 కోట్లు చెల్లించారు.. ఇంకా రూ.55 కోట్లు చెల్లించాలని నోటీసు వచ్చింది. బిజినెస్ రూల్స్‌కు భిన్నంగా గత ప్రభుత్వం తప్పిదం చేసింది. రాష్ట్ర వనరులను తాకట్టు పెట్టింది. ట్రాక్ కోసం రూ.20కోట్లు ఖర్చు పెట్టారు. హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.35 కోట్లు ఖర్చు పెట్టింది. రేస్ సందర్భంగా వారం పది రోజులు రోడ్లు బ్లాక్ చేశారు. ఏజెన్సీ కంపెనీ మాత్రం టికెట్లు అమ్ముకొని వెళ్లిపోయింది. దీని ద్వారా ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం ఉండదు" అని వివరించారు.

# గళం, బలం, దళం..మళ్లీ అదే

### పార్లమెంట్ ఎన్నికల కోసం రంగంలోకి కేసీఆర్


**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**




బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుందా? తెలంగాణ అస్థిత్వంతోనే పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ వెళుందా..? తెలంగాణ వాదమే తమకు శ్రీరామరక్షగా బీఆర్ఎస్ భావిస్తోందా..? గతంలో తమది జాతీయ పార్టీగా చెప్పుకున్న బీఆర్ఎస్ పార్టీ మరోసారి ప్రాంతీయ వాదాన్ని తెరపైకి తీసుకురావడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయింది. పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, కేసీఆర్ మాస్ ఇమేజ్ తో ఎన్నికల బరిలోకి దిగిన గులాబీ పార్టీకి ప్రజలు అవకాశం ఇవ్వలేదు. ఈ తరుణంలోనే పార్లమెంట్ ఎన్నికలు సైతం దగ్గరకు వచ్చాయి. త్వరలోనే లోక్ సభ ఎన్నికలు జరగనుండటంతో.. బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ వాదాన్ని, రాష్ట్ర సెంటిమెంట్ ను తెరపైకి తీసుకువస్తోందిఅయితే, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం.. తెలంగాణ ఉద్యమ పార్టీగా బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. రెండు సార్లు అధికార పగ్గాలు చేపట్టింది. ఆ తర్వాత టిఆర్ఎస్ పార్టీగా ఉన్న పేరును బిఆర్ఎస్ పార్టీగా మార్చుకుంది. బిఆర్ఎస్ పేరుతోనే మూడవ సారి అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన పార్టీకి నిరాశ తప్పలేదు. దీంతో పార్టీ పేరును మార్చడం ద్వారా తెలంగాణ ఉద్యమ మూలాలను మర్చిపోయినట్లు అయిందనే చర్చ జరుగుతోంది. ఇక త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి మెరుగైన ఫలితాలు రావాలంటే తెలంగాణ ఉద్యమ నినాదం, అస్తిత్వం తమకు శ్రీరామరక్షగా పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఇప్పటికే తెలంగాణ గళం, తెలంగాణ దళం పేరుతో పార్టీ బ్యానర్లు మార్చేసింది. పార్టీ ఆఫీస్ లోనూ ప్రెస్ మీట్ బ్యాగ్రౌండ్ మార్చేసింది. అందులో భాగంగానే పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశాల్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ గళం, తెలంగాణ బలం, తెలంగాణ దళం అంటూ.. తెలంగాణ అస్తిత్వ నినాదాన్ని తెరపైకి తెచ్చారు.ఈ నినాదంతోనే పార్లమెంట్ ఎన్నికలకు వెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ పార్టీగా పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ సన్నాహాలను ప్రారంభించింది. ఇక తమ పార్టీ పేరును బిఆర్ఎస్ పార్టీగా మార్చిన తర్వాత దేశ వ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఏపీ విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడుని నియమించారు. మరోవైపు మహారాష్ట్రలో మూడు సార్లు కేసీఆర్ పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పలువురు నేతల్ని పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా సమావేశాల్లో దేశ వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీని విస్తరిస్తామని కేసీఆర్ చెప్పారు. రైతు సమస్యలే ప్రధాన అజెండాగా బిఆర్ఎస్ పార్టీ ముందుకు వెళ్తుందని గులాబీ బాస్ తెలిపారు. కానీ పరిస్థితులు మారాయి. అధికారం కోల్పోవడంతో మళ్లీ జై తెలంగాణ అంటూ ప్రజల్లోకి వెళ్లనుంది ఎక్కడ పోగొట్టుకున్నామో %ూ% అక్కడే వెతుక్కోవాలి అనే తరహాలో గులాబీ పార్టీ ఆలోచిస్తుంది.

## 4 ఏళ్ల కొడుకును చంపిన స్టార్టప్ సీఈవో

**టీ మీడియా, జనవరి 9, పనాజీ:**



ఓ మహిళా వ్యాపారవేత్త తన నాలుగేళ్ల కుమారుడిని అతి దారుణంగా హత్య చేసింది. ఎవరికీ అనుమానం రాకుండా ఆ చిన్నారి మృతదేహాన్ని బ్యాగులో దాచిపెట్టి.. గోవా నుంచి కర్ణాటక వరకు ట్యాక్సీలో ప్రయాణించింది. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఆమెను అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన సుచనా సేత్ ఓ స్టార్టప్‌ని స్థాపించి, సీఈవో గా వ్యవహరిస్తోంది. గత శనివారం ఆమె తన నాలుగేళ్ల కుమారుడిని తీసుకుని ఉత్తర గోవాలోని ఒక హోటల్‌కు వెళ్లింది. సోమవారం ఉదయం అక్కడ గదిని ఖాళీ చేసి ట్యాక్సీలో కర్ణాటకకు బయల్దేరింది. ఆ గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన సిబ్బంది.. అక్కడ రక్తపు మరకలను గుర్తించారు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. హోటల్‌లో దిగినప్పుడు కుమారుడితో కలిసి కన్పించిన సుచనా.. వెళ్లేటప్పుడు మాత్రం ఒంటరిగా కన్పించడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే ఆమె వెళ్లిన ట్యాక్సీ డ్రైవర్‌కు పోలీసులు ఫోన్ చేసి సుచనాతో మాట్లాడారు. అయితే, తన కుమారుడిని ఫ్రెండ్ ఇంటి వద్ద వదిలేసినట్లు ఆమె చెప్పింది. సుచనా ఇచ్చిన ఫ్రెండ్ అడ్రస్ నకిలీదని తేలడంతో పోలీసుల అనుమానం బలపడింది. వెంటనే కర్ణాటక పోలీసులకు సమాచారమిచ్చారు. అదే సమయంలో, ట్యాక్సీ డ్రైవర్‌ను సంప్రదించి అనుమానం రాకుండా ఆమెను సమీపంలోని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాలని సూచించారు. చివరకు కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె బ్యాగులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. సుచనాను అరెస్టు చేశారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.


## ఓటర్ల జాబితాలో ఓట్ల తొలగింపుపై

# ఫిర్యాదు చేశాం

### చంద్రబాబు, పవన్

**టీ మీడియా, జనవరి 9, విజయవాడ:**

కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం ప్రతినిధులతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌లు, వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి విజయవాడలో భేటీ అయ్యారు. వీరితో పాటు బిజెపి, సీపీఎం, బీఎస్పీ, ఆప్ నేతలు హాజరయ్యారు. సీఈసీ రాజీవ్‌కుమార్‌ను కలిసి రాష్ట్రంలో ఓటరు జాబితాలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం చంద్రబాబాబు, పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల అధికారులను కలిసి రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏపీలో ఎన్నికలపై ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణలో సజావుగా ఎన్నికలు సాగాయి. ఇక్కడ కూడా అలాగే నిర్వహించేలా చూడాలన్నారు. ఆరు వేల నుంచి ఏడు వేల ఓట్లు తొలగించినట్లు ఫిర్యాదు చేశామన్నారు. దొంగ ఓట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నిస్తే బైండోవర్ కేసులతో ప్రతి పక్షాలను వేదిస్తున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బందిని ఎన్నికల డ్యూటీకి దూరంగా ఉంచాలని కోరామన్నారు. తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తమ కార్యకర్తలను పనిచేసుకోనివ్వడం లేదని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి ఓటువేసే అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఏపీలో ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీలో అధికార దుర్వినియోగం జరుగుతోందన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామని ఎన్నికల సంఘం హామీ ఇచ్చినట్లు తెలిపారు. వాలంటీర్ వ్యవస్థ రాజ్యంగ వ్యతిరేకం అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు చర్యలు చేపట్లాలన్నారు. ఏపీలో దొంగ ఓట్లపై ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు.






## పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేసిన నాయకులకు బుద్ధి చెప్పాలి

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

**టీ మీడియా, జనవరి 9, వనపర్తి బ్యూరో :**

తెలంగాణ భవన్ నందు నిర్వహించిన ఖమ్మం పార్లమెంట్ రివ్యూలో కె.టి.అర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో అన్ని పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేసి పోయిన నాయకులకు చెంప చెళ్లుమనిపించే విధంగా ఖమ్మం పార్లమెంట్ గెలిచితీరాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేయడం కోసం ప్రజాపాలన,జ్యోతిరావు పూలే ప్రజావాణి అంటూ ఆర్భాటం చేసి గాలికి వదిలేసింది అని ప్రజాపాలన పేరిట వచ్చిన దరఖాస్తులను రోడ్లపాలు చేసి ప్రజల అవసరాలను అభాసుపాలు చేసిందని ఇచ్చిన హామీలు అమలు చేయలేక బి.అర్.ఎస్ పార్టీని బాధ్నాం చేస్తూ రాష్ట్ర పరిస్థితి అప్పులుగా వుందని శ్వేతపత్రం అంటూ డ్రామాలు చేస్తుందని అన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకే అభ్యర్థులను నిర్ణయిస్తామని కసిగా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. ఈ సమావేశములో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ,మాజీ ఎం.పి రావుల.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

# పురుగుల అన్నం పెడుతున్నారు

- ఓయూ హాస్టల్ ముందు విద్యార్థినుల ధర్నా

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**
ఉస్మానియా యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ ముందు విద్యార్థినులు ధర్నా చేపట్టారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చాయంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గత కొన్ని రోజులుగా భోజనం సరిగా లేక ఇబ్బందుల పాలవుతున్నామన్నారు. పురుగుల అన్నం తిని ఆరోగ్యంగా ఉండలేకపోతున్నామని, నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. చీఫ్ వార్డెన్‌ను తొలగించి సరైన సౌకర్యాలు కల్పించాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు. గతంలోనే సమస్యలు పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ లేడీస్ హాస్టల్ డైరెక్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఓ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. మూడు



నెలల నుంచి లేడిస్ హాస్టల్‌లో ఉంటున్నానని, వాడిన నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారని తెలిపారు. మూడు, నాలుగు సార్లు పాలిష్ చేసిన బియ్యం వినియోగిస్తున్నారని, తమ సమస్యల గురించి అధికారులకు విన్నవిస్తే అడ్మిషన్ క్యాన్సిల్ చేస్తామని బెదిరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ర్యాంకులు కొట్టి అడ్మిషన్ పొందితే తమ సమస్యలు కనీసం పట్టించుకునే నాదుడు లేడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చీఫ్ వార్డెన్‌ను కలిసి తమ సమస్యల గురించి చెప్పినా.. కనీసం ఒక్కసారైనా వచ్చి పరిశీలించలేదన్నారు. వెజిటబుల్స్‌లో పురుగులు వస్తున్నాయని చెబితే.. వాటిని తీసివేసి తినాలని చెబుతున్నారని తెలిపారు. 20 నుంచి 30 మంది విద్యార్థులు కడుపునొప్పితో బాధపడుతున్నారని, ఇక్కడికి వచ్చింది ఆరోగ్య సమస్యలతో మా సమయం వృధా చేసుకోవడానికా.. మేము చదువుకోవద్దా అని ప్రశ్నిస్తున్నారు. ఇంత వరకు చీఫ్ వార్డెన్ పేరు ఏమిటో కూడా మాకు తెలియదు. మా సమస్యలను పరిష్కరించి, మాకు మంచి ఆహారం అందించే అధికారులు కావాలంటూ విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

## నూతన రేషన్ షాప్ ను ఏర్పాటు చేయాలి

- పౌర సరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన
- కాంటెస్టడ్ ఎమ్మెల్యే దయానంద్




**టీ మీడియా, జనవరి 9, వనపర్తి బ్యూరో :**
వనపర్తి రాంనగర్ కాలనీ లో రేషన్ షాప్ సమస్య పై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాంటెస్టడ్ ఎమ్మెల్యే దయానంద్ వనపర్తి పట్టణంలో స్థానిక డీఎస్ఓ కార్యాలయంలో నూతన రేషన్ షాప్ రాం నగర్ కాలనీ (13 వ వార్డ్) లో ఏర్పాటు చెయ్యాలని అధికారులకు వినతి పత్రం అందజేసిన వనపర్తి నియోజకవర్గ కాంటెస్టడ్ స్వతంత్ర ఎమ్మెల్యే దయానంద్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రోజున రాం నగర్ కాలనీ (13వ వార్డు )లో నిర్వహించిన మార్నింగ్ వాక్ లో కాలనీ లో ని సమస్య లను కాలనీ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాం నగర్ కాలనీ లో ప్రధాన సమస్య రేషన్ షాప్ కావడంతో మహిళలు, వృద్దులు చాలా రోజుల నుంచి ఇబ్బంది గురవుతున్నారు. ఈ అంశం పై జిల్లా పౌర సరఫర శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశం పై నూతన ప్రభుత్వంలో ప్రజల సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తూన్నామని తెలిపారు.

## ఈడి చార్జిషీటులో రబ్రీదేవి, మీసాభారతిల పేర్లు



**టీ మీడియా, జనవరి 9, న్యూఢిల్లీ :**
రైల్వే ఉద్యోగాల కోసం భూములకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి ) మంగళవారం మొదటి చార్జిషీటు సమర్పించింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, ఆమె కుమార్తె ఎంపి మీసాభారతిల పేర్లను చేర్చింది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు లాలూ యాదవ్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అమిత్ కత్యాల్ సహా మరికొందరు, కంపెనీల పేర్లను చేర్చినట్లు పేర్కొన్నారు. ఢిల్లీలోని ప్రత్యేక అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కోర్టులో చార్జిషీటును అప్పీలు చేశామని, ఈ కేసును జనవరి 16న విచారించాలని కోర్టు జాబితా చేసిందని వెల్లడించాయి. కాగా, అమిత్ కత్యాల్‌ను గతేడాది నవంబర్‌లో ఈడి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అదే సమయంలో లాలూ యాదవ్, బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌లకు కూడా సమన్లు జారీ చేసింది.



## ఘనంగా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి

**టీ మీడియా, జనవరి 9, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా గోపాల్ పేట్ మండలం లలితా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రుక్మేందర్ నోబెల్ బహుమతి గ్రహీత, పద్మవిభూషణ్ పురస్కారం స్వీకర్త, ప్రపంచ ప్రఖ్యాత జీవ శాస్త్ర వేత్త " హారగోవింద్ ఖొరానా " జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జనవరి 9 భారతీయ విద్యా వేత్త, సంఘసంస్కర్త, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే లతో కలిసి పనిచేసిన మహిళా, భారతదేశపు మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు " ఫాతిమా షేక్ " జయంతి సందర్భంగా ఆమెను స్మరించుకోవడం జరిగింది. పాఠశాల చిన్నారులు ఉపన్యాసాలు ఇవ్వటం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ రుక్మేందర్ మాట్లాడుతూ " మధ్యాహ్నం విరామ సమయంలో విజ్ఞానం వైపు అడుగులు " అనే తపనతో పాఠశాల చిన్నారులకు జ్ఞానవంతమైన, స్ఫూర్తివంతమైన, చైతన్యవంతమైన, మహానీయుల, మేధావుల, సంఘసంస్కర్తల జీవిత చరిత్ర లను చర్చించుకోవడం చాలా చాలా స్ఫూర్తి వంతమైనదని వివరించడం జరిగింది. మంచిఆలోచనలే ప్రేరణలు అవుతాయి,మంచి ప్రేరణలే పునాదులు అవుతాయి,మంచి పునాదులే చరిత్రలో శాశ్వతంగా నిలిచి పోతాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రుక్మేందర్, కరస్పాండెంట్ రాములమ్మ, అత్యధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.




## నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

- ఎంపిడిఓ శివ నాగజ్యోతి

**టీ మీడియా, జనవరి 9, మహానంది:**
నేటి నుండి మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ శివ నాగజ్యోతి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..10వ తేదీన కబడ్డీ,11న వాలీబాల్,12న బాట్మింటన్,17న కోకో,18నుండి 20వరకు క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడా పోటీలను తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాటశాల ప్రాంగణంలో జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు



## ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

**టీ మీడియా, జనవరి 9, వనపర్తి బ్యూరో :**
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలూకా ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం అయినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమన్ దాస్ రాజేష్ గౌడ్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ అన్న చెప్పిన అడుగుజాడల్లో మేమంతా నడుస్తామని అలాగే మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా కార్యదర్శి మిద్దె నరసింహ యాదవ్ , బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు గున్ రెడ్డి బ్రహ్మనంద రెడ్డి , తిరుమాందాస్ గోవింద్ గౌడ్, అలాగే అభిమానులు గోపాల్ , రఘు, అమర్నాథ్, హరికృష్ణ, రమేష్, ఖాదర్, చిట్టిబాబు, రాము, సాయి, మోహనా చారి, పల్లె శివ, కిరణ్ , జయరాం మొదలగు అభిమానులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా కార్యదర్శి మిద్దె నరసింహ మాట్లాడుతూ మాకు ఎంతగానో సహకరిస్తున్న జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ కి రాష్ట్ర కన్వీనర్లైన నందిపాటి మురళిశకుమార్ యాదవ్ కి నరసన్నకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

## చందాపురంను దత్తత గ్రామంగా స్వీకరించిన

- ఎమ్మెల్యే మేఘ రెడ్డి



**టీ మీడియా, జనవరి 9, వనపర్తి బ్యూరో :**
ఎన్నికల ప్రచారంలో తానిచ్చిన హామీలకు కట్టుబడి ఉంటానని తనకు మంచి మెజారిటీ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషిచేసిన చందాపురం గ్రామస్తులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటిసారిగా చందాపురం గ్రామానికి వెళ్లిన ఆయన గ్రామంలోని పాఠశాల నుంచి గాంధీనగర్ వరకు రూ పది లక్షలతో సిసి రోడ్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్యన ఎమ్మెల్యేను ఊరేగిస్తూలానికి సభ స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎన్నికల ప్రచార కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన నాడు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తానని తప్పకుండా చందాపురం గ్రామంను దత్తత తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హాయంలో గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగితే నేడు చెందాపూర్ గ్రామంలో అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో 741 దరఖాస్తులు ఎందుకు వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం గ్రామస్తులందరూ ఆలోచన చేయాలని కేవలం మాటలు చెప్పడమే తప్ప అభివృద్ధి పనులు చేయలేదని ఆయన విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీ తరఫున నిలబడిన వ్యక్తులను గెలిపిస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవని ఆయన అన్నారు. కెనాల్ తవ్వి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పిన నాయకుడు పెద్దపెద్ద బావులు తవ్వుకొని ఆ బావి నుంచి ఫామ్ హౌస్ సాగునీటిని తరలించారని పేర్కొన్నారు. గ్రామానికి సాగునీరు అందించే కెనాల్ ను పరిశీలించి వస్తున్నానని గ్రామానికి చెందిన గోల్లోని కుంట, వేదాంతచారి కుంటలకు సాగునీటికి మళ్ళిస్తే అక్కడినుంచి గ్రామానికి చెందిన 250 ఎకరాలకు సాగునీరు అందుతుందని అందుకు సంబంధించి అధికారులను ఆదేశించానని వారం రోజుల్లో సర్వే నిర్వహించి పనులు ప్రారంభిస్తారని ఆయన అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలలో రెండు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేసిందని మిగిలిన గ్యారెంటీ ల కోసం గ్రామ గ్రామాన ఉన్నటువంటి దాకా తీసుకున్న దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని 100 రోజుల్లో ప్రతి ఒక్కరికి ప్రభుత్వ లబ్ధి అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటయ్య యాదవ్, సర్పంచ్ చెన్నరెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాజు, యువత అధ్యక్షులు గోపాల్, సుదర్శన్, పంచాయతీ సెక్రెటరీ రాజశేఖర్, నాయకులు వెంకటరెడ్డి, చల్మారెడ్డి, సుధాకర్, దేవేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా అద్దె ఇంట్లోనే కాపురాలు




**టీ మీడియా, జనవరి 9, రేవల్లి :**
వనపర్తి జిల్లా రేవల్లి మండలం కేంద్రంలో కొత్త మండలం ఏర్పడి ఎనిమిదవ వసంతంలోకి అడుగిడినా. మన మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం అద్దె భవనంలోనే కొనసాగుతున్నాయి. అరకొర సౌకర్యాల మధ్య పాలన కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. సరైన వసతులు లేక ఉద్యోగులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. శాశ్వత భవనాలు కొన్ని మండల చోట్లనే నిర్మాణాలు జరుగుతున్నాయి. రేవల్లి మండలం కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ మాత్రం అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. మౌలిక వసతులు లేకపోవడంతో, ప్రజలు వచ్చే పనుల కోసం అవస్థలు పడుతున్నారని. మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే కూర్చోవడానికి స్థలం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త భవనాల కోసం స్థలంలో శంకుస్థాపన చేసినప్పటికీ శాశ్వత భవనం నిర్మించడానికి వెనుకాడుతున్నారు. కొత్తగా ఏర్పాటైన ఈ మండలంలో పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయలు ఓ ఇంటిలో ఇప్పటి వరకు అద్దెలో ఉంటూ నెల నెలా కిరాయి కడుతూ నెలకొల్పారు. తహసిల్దార్ కార్యాలయంకు నెలకు ఎంత అద్దె చెల్లిస్తున్నారనేది ఇప్పటివరకు ప్రజలకు తెలియదు, కానీ పోలీస్ స్టేషన్ కు ఆరు వేల ఐదు వందల రూపాయలు ప్రతి నెల చెల్లిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలో కొత్తగా జిల్లాలు, మండలాలు ఏర్పడిన మన మండలంలో మాత్రం ప్రభుత్వ కార్యాలయాలు అద్దెలోనే ఉంటున్నాయని ప్రజలు చి చి సిగ్గుచేటు అంటూ నవ్వుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏర్పడింది ఇప్పుడన్నా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయలకు భవనాలను అందుబాటులోకి తేవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వైభవంగా మంగళహారతుల వేడుకలు



**టీ మీడియా, జనవరి 9, పెద్దపల్లి :**
పవిత్రమైన ధనుర్ మాసంలో మంగళహారతులతో కూడిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు సుల్తానాబాద్ పట్టణంలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం లో నిర్వహించారు. మంగళవారం మహిళలు సామూహికంగా స్వామి వారికి మంగళహారధులను సమర్పించారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా, తిరుప్పావై 30 పాశురాలలో ఈరోజు 24వ పాశురం మంగళ హారతులకు సంబంధించినది కావడంతో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తిరుప్పావై ధనుర్మాస వ్రతంలో భాగంగా స్వామి వారికి మంగళం పాడారు ఉదయాన్నే మహిళలు ఇంటి నుంచి మంగళ హారతులను తీసుకుని వచ్చి ఆలయము లో అన్రు ఇవ్వలగం.. అనే పాశురాన్ని అనుసంధానం చేసి మంగళహారతులతో స్వామివారికి నివేదిస్తారు. దాంతో పాటే మహిళలు భక్తులు మంగళహారతుల పాటలను కూడా స్వామివారికి నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సావిత్రి శ్రావణ్ కుమార్ హరిణి, శ్రీ వేంకటేశ్వర శరణాగతి గోష్టి నిర్వహణ బాధ్యులు సాదుల సుగుణాకర్ సునీత దంపతులతో పాటు ఎంపీపీ బాలాజీ రావు స్వరూప,పోదిల్లా రమేష్, వాసాల రవీందర్ సాధుల శివ సాయి, పల్ల సదాలక్ష్మి జలజ పల్లా లలిత రాజమణి,కట్టా రమ, దీప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కేపీలో వాహనాల ఆకస్మిక తనిఖీలు

- మందమర్రి సిఐ మహేందర్ రెడ్డి



**టీ మీడియా, జనవరి 9, రామకృష్ణాపూర్ :**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో మంగళవారం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సైలు పట్టణంలోని ప్రధాన కూడళ్ళు ,రైల్వే గేట్ దగ్గరలో వాహనాలను తనకి చేయడం జరిగింది. ధ్రువీకరణ పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, నెంబర్ ప్లేట్స్ నిబంధనల ప్రకారం లేని వాహనాలపై కేసులు నమోదు చేసి13 బైకులు సీట్ చేశారు,42 చలాన్స్,ఒక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేయడం జరిగింది. ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించి రోడ్డు భద్రత నియమాలు,ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలన్నీ కలిగి ఉండాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలియజేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై,మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కెపి ఎస్సై రాజశేఖర్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, కాసిపేట ఎస్సై గంగారం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పండగ రద్దీతో ప్రజలను దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్

**టీ మీడియా, జనవరి 9, రామకృష్ణాపూర్ :**
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో షెడ్యూల్ క్యాస్ట్ మాదిగ ఫెడరేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, న్యాయవాదులు రాజలింగు మోతే, ముల్కల కనకయ్యలు మాట్లాడుతూ మకర సంక్రాంతి పండుగ రద్దీని ప్రైవేట్ ట్రావెల్స్ క్యాష్ చేసుకుంటున్నాయని, ప్రయాణికులను నిలువుగా దోచేస్తున్నారని,మొక్కు పిండి ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ఇప్పటికే ఆర్టీసీ,రైళ్లలో టికెట్స్ దొరకకపోవడంతో తప్పనిసరి ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్ ను ఆశ్రయిస్తున్నారు. దానితో ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు టిక్కెట్ ధరలను అమాంతంగా పెంచారు. ఎలా టిక్కెట్ ధరలను అమాంతంగా పెంచడం వల్ల ప్రజలు సొంత ఊర్లకు వెళ్ళడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. కావున సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.




## హైదరాబాద్‌లో కొనసాగుతున్న సోదాలు

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**
హైదరాబాద్ లో ఐటీ(ఆదాయపు పన్ను శాఖ) అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఒక ఫార్మా కంపెనీలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఇవాళ తెల్లవారు జామునుంచే ఆదాయపు పన్ను శాఖ అధికారులు బృందాలుగా విడిపోయి ఓ ఫార్మా కంపెనీ యజమాని, ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. రాయదుర్గం, మొయినాబాద్, కోకాపేట తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఐటీ తనిఖీలు జరుగుతున్నాయి. భారీగా ఆదాయపు పన్నును ఎగవేశారన్న ఆరోపణలతో ఫార్మా కంపెనీపై దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మోయినాబాద్‌లోని స్కిల్ ప్రమోటర్స్ ఇళ్లల్లోనూ ఐటీ సోదాలు జరుగుతున్నాయి. శ్రీ హరి హోమ్స్ నిర్వాహకుల నివాసాల్లోనూ సోదాలు కొనసాగుతున్నాయి. పూర్తి సమాచారం తెలియల్సి ఉంది.



## ఆసుపత్రికి వెళ్లి పింఛన్లను అందజేసిన వాలంటీర్

**టీ మీడియా, జనవరి 9, మహానంది:**
సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు విశేషంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం వ్యయ ప్రయాసలకోర్చి వెళుతున్నారు. మహానంది గ్రామనికి చెందిన గుబ్బి లలితమ్మ, శ్రీకాంత్ వీరిద్దరూ అనారోగ్య కారణంగా రేవనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం వాలంటీర్ సాంబశివరావు, గ్రామ సర్పంచ్ భర్త చలం చలం తిరుపతయ్య అక్కడకు వెళ్లి వృద్ధాప్య, వికలాంగ ఫించన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.




## ఘనంగా నందీశ్వర అభిషేకం, ప్రదోషకాల పూజలు

**టీ మీడియా, జనవరి 9, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో మార్గశిర బహుళ త్రయోదశి శివ ప్రదోషం సందర్భంగా మంగళవారం ఘనంగా నందీశ్వర అభిషేకం ప్రదోషకాల పూజలు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ గావించి, స్వామి వారికి వివిధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వేద పండితులు రవిశంకర అవధాని,శాంతారాంబట్, హనుమంతు శర్మ లు వేదమంత్రాలతో ద్వారపాలకపూజ పీఠార్చన, పంచామృతాభిషేకం, వివిధ చూర్ణాభిషేకం, నందీశ్వరార్చన తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగోత్రికి చెందిన నాగసాధు నాగవ సత్యనారాయణ స్వామిజీ, భక్తులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి భేటీ

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూర్పు జయప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి) కలిశారు. మంగళవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో కలిశారు. ఇరువురు దాదాపు ఇరవై నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిస్థితులపై వారు చర్చించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ కోసం పని చేసిన నాయకులకు ఎమ్మెల్సీలు ఇవ్వాల్సి ఉందని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అదే సమయంలో త్వరలో లోక్ సభ ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, లోక్ సభ స్థానాలకు సంబంధించిన అంశాలపై మాట్లాడి ఉంటారనే చర్చ సాగుతోంది.



## మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ

**టీ మీడియా, జనవరి 9, మహానంది:**
ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారుజామునే పలు ప్రాంతాలకు చెందిన భక్తులే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు మహానందికి తరలివచ్చారు. కోనేరులో పుణ్య స్థానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వినాయక, గరుడనంది, కోదండ రామాలయం ఆలయాలను సందర్శించారు.క్షేత్ర పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు స్వామి అమ్మవార్ల దర్శనం నిర్విరామంగా కొనసాగింది.

## మేడిగడ్డపై జ్యూడిషియల్ విచారణ జరుపుతాం

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**
మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోవడంపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం నాడు సచివాలయంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. మేడిగడ్డ నుంచి హైదరాబాద్ వరకు ఉన్న పది నీటి పారుదల కార్యాలయాలల్లో విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం మేడిగడ్డ విషయంలో సీరియస్‌గా స్పందించిందన్నారు. మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చామన్నారు. మేడిగడ్డలో జరిగిన పిల్లర్ల కుంగుబాటుపై సిట్టింగ్ న్యాయమూర్తితో జ్యూడిషియల్ విచారణ జరుపుతామన్నారు. మేడిగడ్డపై క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేశామని చెప్పారు. సిట్టింగ్ జడ్జి విచారణ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.





## మహానందిలో ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ కమిటీ ఎస్టిమేట్ చైర్మన్ కళావతి పూజలు

**టీ మీడియా, జనవరి 9, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ కమిటీ ఎస్టిమేట్ చైర్మన్ కళావతి, కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదలతో ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అధికారులు స్వాగతం పలికారు.శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఈవో స్వామి వారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.



## మహానందిలో ఆంధ్రప్రదేశ్ ఎస్టిమేట్ చైర్మన్, ఎమ్మెల్యే పూజలు

**టీ మీడియా, జనవరి 9, మహానంది:**
మహానంది పుణ్యక్షేత్రంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎస్టిమేట్ కమిటీ చైర్మన్, పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే విశ్వాసరాయ కళావతి, కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదలతో మహానంది తహసీల్దార్ జనార్దన్ శెట్టి,ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు.శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు.పూజల అనంతరం ఈవో స్వామి వారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా దామోదర్

**టీ మీడియా, జనవరి 9, కొత్తగూడెం :**
మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి ప్రాంతానికి చెందిన మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను ఆ పార్టీ నియమించింది. ఇటీవలే ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ మళ్లీ తన ఉనికిని చాటుకోవడంతోపాటు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా మావోయిస్టులు తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ.. అప్పుడప్పుడు అలజడులు సృష్టిస్తూ వస్తున్నారు. అయితే మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కోవిడ్ బారినపడి 21, జూన్ 2021లో మృతిచెందిన విషయం విదితమే. దీంతో అప్పటి నుంచి తెలంగాణ



రాష్ట్ర కార్యదర్శి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఆ పార్టీ కట్టుదిట్టమైన వ్యూహాలు రచించింది. ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు మావోయిస్టు నేత ఆజాద్ సైతం తనవంతు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది.చివరికి మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌అలియాస్ మల్లన్నను నియమించింది. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, ఏఓబీ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సాయన్న, కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ మడివి హిడ్మా అలియాస్ హిద్మాతోపాటు మరికొందరు కీలక నేతలతో జరిగిన సమావేశంలో బడే చొక్కారావుని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు సమాచారం.





## రాజీనామాలను ఆమోదించండి..

- గవర్నర్ తమిళిసైకి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ..

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**
టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలు చేసి నెల రోజులు గడుస్తున్నా.. గవర్నర్ వాటిని ఆమోదించడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ లేకపోవడంతో ఉద్యోగాల భర్తీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే దీనిపై గవర్నర్ ఓ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ మేరకు జీవన్ రెడ్డి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కు లేఖ రాశారు. %ఖ్రూాజ% చైర్మన్, సభ్యుల రాజీనామాలను వెంటనే ఆమోదించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. నెల రోజులు గడుస్తున్నా రాజీనామాలు ఆమోదించడం లేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి హైదరాబాద్ లోని గాంధీ భవన్‌లో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీలో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందంటూ పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలోని టి ఎస్ పి ఎస్ సి బోర్డు అనేక అవకతవకలకు పాల్పడిందని.. బోర్డు తప్పిదాలను గత ప్రభుత్వం కప్పిపుచ్చిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. టి ఎస్ పి ఎస్ సి చైర్మన్ రాజీనామాను ఆమోదించకపోవడం వల్ల నియామకాల ప్రక్రియ జాప్యం జరుగుతోందన్నారు.ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని జీవన్ రెడ్డి.. పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో గవర్నర్ త్వరగానిర్ణయం తీసుకోవాలని.. %ఖ్రూాజ% చైర్మన్ సహా సభ్యుల రాజీనామాలను ఆమోదించాలని కోరారు.



## సైఫ్‌పై వచ్చిన ఆరోపణలు నిజమే..

- ప్రీతి ఆత్మహత్య కేసు
- నిద్ధారించిన ర్యాగింగ్ నిరోధక కమిటీ

**టీ మీడియా, జనవరి 9, హైదరాబాద్:**
గతేడాది ఫిబ్రవరిలో 22న జరిగిన కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని ధారావత్ ప్రీతి ఆత్మహత్య కేసులో విచారణను ఎదుర్కొంటున్న సైఫ్‌పై వచ్చిన ఆరోపణలు నిజమేనని ర్యాగింగ్ నిరోధక కమిటీ తేల్చింది. సైఫ్‌పై గతంలో విధించిన సస్పెన్షన్ కాలం ఈ ఏడాది మార్చి 3వ తేదీతో ముగుస్తుండగా.. దానిని మరో 97 రోజులపాటు పొడిగించింది. గతేడాది ఫిబ్రవరి 22న సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులతో ప్రీతి ఎంజీఎం ఆసుపత్రిలో ఆత్మహత్యకు యత్నించి.. అదే నెల 26న నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. పోలీసులు సైఫ్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపగా.. ఏడాదిపాటు అతడు తరగతులకు రాకుండా వేటు వేస్తూ కేఎంసీ ర్యాగింగ్ నిరోధక కమిటీ నిర్ణయం తీసుకుంది. సైఫ్ హైకోర్టును ఆశ్రయించగా%జొ% తాత్కాలికంగా సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. గత నవంబరు 9న హైకోర్టు ఆదేశాల మేరకు ర్యాగింగ్ నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. సైఫ్ హాజరై వివరణ ఇచ్చాడు. దీనిపై చర్చించిన కమిటీ సభ్యులు.. సైఫ్‌పై ఆరోపణలు వాస్తమేనని న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ క్రమంలో కమిటీ విధించిన సస్పెన్షన్‌ను కొనసాగించవచ్చని న్యాయస్థానం పేర్కొంది.



## ఎమ్మెల్యే పేరు చెప్పి వసూళ్ల పర్వం

**టీ మీడియా, జనవరి 9, వనపర్తి బ్యూరో :**
వనపర్తి నియోజకవర్గ ప్రజలకు వనపర్తి ఎమ్మెల్యేగా మీ మేఘారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు వనపర్తి నియోజకవర్గ పరిధిలోని కొంతమంది వ్యక్తులు ఎమ్మెల్యే అయిన నాపేరు వాడుకుంటూ రైస్ మిల్లుల వద్ద, ఇసుక క్వారీల వద్ద, వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తుల వద్ద మద్యం దుకాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నట్లు అభియోగాలు వినిపిస్తున్నాయి అన్నారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే స్పందిస్తూ ఎవరైనా ఇలాంటి ఇబ్బందులకు గురి చేస్తే నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడును. నా సెల్ ఫోన్ నెంబర్ 9494216666 ఫోన్ లేదా మెసేజ్ కూడా చేయవచ్చు మీ పేరు గోప్యంగా ఉంచబడును అన్నారు. గెలిచిన నెల రోజులకే ఎమ్మెల్యే పేరు వాడుకొని వసూళ్లకు పాల్పడుతున్నారని ఒక ఎమ్మెల్యే నే చెప్పడం వనపర్తి నియోజకవర్గంలో చర్చనీయమైంది.



## ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా డ్రామాలెందుకు.?

- ఎంపీ బండి సంజయ్

**టీ మీడియా, జనవరి 9, రాజన్న సిరిసిల్ల :**
అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ, కంప్యూటరీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో కాలయాపన చేస్తోందని ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. షెడ్యూల్ ప్రకారం చూస్తే వచ్చే మార్చి, ఏప్రిల్ లో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. అంతకంటే ముందే ఫిబ్రవరిలోనే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశముంది. ఈ విషయం తెలిసి కూడా దరఖాస్తుల కంప్యూటరీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేయడమంటే డ్రామాలాడటమేనని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని వెంకటంపల్లి గ్రామానికి వచ్చిన బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో కాలయాపన చేస్తూ డ్రామాలు చేస్తే ప్రజలు హర్షించరనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.



## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

- ఇద్దరిపై కేసు నమోదు అరెస్ట్

**టీ మీడియా, జనవరి 9, పెద్దపల్లి బ్యూరో :**
పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి, తారుపల్లి, పందిళ్ళ గ్రామలలో గుడుంబా స్థావరాలపై మంగళవారం రోజున ఎక్సైజ్ సుల్తానాబాద్ సిఐ ఆనందరావు ఆధ్వర్యంలో గుడుంబా స్థావారాలపై దాడులు నిర్వహించారు. పేగడపల్లి గ్రామానికి చెందిన సంపంగి మల్లయ్య, దున్నపోతుల కనకమ్మ అను ఇద్దరి పై కెసు నమోదు అరెస్టు చేసినట్లు, అలాగే వారి వద్ద స్థావరలపై దాడి చేయగా 350 లీటర్ల బెల్లం పానకం పారబోసి,13 లీటర్ల గుడుంబా సారను సీల్ చేసినట్లు వారు తెలిపారు. వారి వెంట ఎక్సైజ్ అధికారులు స్టేట్ టాస్క్ ఫోర్స్ సీఐ రాంరెడ్డి,కరీంనగర్ సీఐ విజయ్ కుమార్, పెద్దపెల్లి డి టి ఎఫ్ సీఐ రాథోడ్, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శిరీష సాయిబాబా వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.





## ఇంటింటికి చేరిన అయోధ్య శ్రీరాముని అక్షింతలు

**టీ మీడియా, జనవరి 9, రామకృష్ణాపూర్ :**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు భగత్ సింగ్ నగర్ కోటర్స్ ఏరియాలోని భక్తులు మంగళవారం శ్రీ కోదండ రామాలయానికి మంగళ హారతులతో చేరుకుని, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్టాపన అక్షింతలను తీసుకోవడం జరిగింది.అనంతరం ఆకుల జమున,రాజన్న దంపతుల చేతుల మీదుగా గడప గడపకు వెళ్లి అయోధ్య శ్రీరాముని అక్షంతలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ ఊరేగింపుగా ముందుకు సాగారు. కాలనీవాసులందరికీ అయోధ్య రాముని అక్షింతలను పంచారు.ఈ కార్యక్రమంలో స్నేహ గణేష్ మండలి కమిటీ సభ్యులు లింగారావు,సంపత్ రావు, నరసయ్య, రాజశేఖర్,రాజ్ కుమార్ ,శ్రీకాంత్, శ్రీనివాస్, విజయ్, వేణు, అజయ్, సంతోష్ భక్తులందరూ శ్రీరాముల వారి అక్షంతలను స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు.